క్లుప్తంగా

లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు



లారీ డ్రైవర్‌కు కంటి పరీక్ష చేస్తున్న కిరణ్ కంటి ఆస్పత్రి వైద్యుడు

కాకినాడ రూరల్: కోరమాండల్ ఎరువుల కర్మాగారం ఆధ్వర్యంలో ఏడీబీ రోడ్డులో లారీ డ్రైవర్లు, క్లీనర్లకు కంటి వైద్య పరీక్షలను బుధవారం కిరణ్ కంటి ఆస్పత్రి వైద్యుల సహకారంలో నిర్వహించారు. ఈ శిబిరాన్ని కోరమాండల్ సీనియర్ మాన్యుఫాక్చరింగ్ హెడ్ జగనాథన్ ప్రారంభించగా, డీజీఎం సంబిత్ ప్రధాన, కెప్టెన్ భార్గవ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొత్తం 211 మంది డ్రైవర్లు, హెల్పర్లకు పరీక్షలు నిర్వహించి, 169 మందికి కళ్ల అద్దాలు అవసరమని గుర్తించారు. ఆరుగురికి కంటిలో శుక్లాలు, ఏడుగురికి శస్త్రచికిత్సలు అవసరమని తెలిపారు. 81 మందికి మందులు అందించారు. కోరమాండల్ చెందిన వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గణేశ పంచరత్న స్తోత్రంపై పోటీలు

బోట్‌క్లబ్: వినాయక చవితి సందర్భంగా భరద్వాజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న గణేశ పంచరత్న స్తోత్రంపై 5 నుంచి 15 ఏళ్ల లోపు వారికి పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు డాక్టర్ ఐవీ రావు తెలిపారు. సమితి కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటితరం బాలబాలికల్లో సనాతన ధర్మం పట్ల శ్రద్ధ పెంచే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. సంఘ కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ ఇతిహాస పురాణాల ప్రభావాన్ని పరిచయం చేయాలన్నదే తమ సంఘ లక్ష్యమన్నారు. ఈ పోటీల్లో గణేశ పంచరత్న స్తోత్రాలను ఆలపించిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులతో పాటు పది మందికి కన్సోలేషన్ బహుమతులు ఇస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారి పేర్లు, ఫోన్ నంబరు, వయసు, చిరునామా, పాఠశాల పేరు, వివరాలను వాట్సాప్ ద్వారా ఫోన్ నంబర్ 79897 35152కు పంపాలని కోరారు. ఈ పోటీలు కాకినాడ రమణయ్యపేటలోని లయన్స్ డిస్ట్రిక్ట్ 316బీ మల్టీసర్వీస్ హాల్, ఏపీఐఐసీ కాలనీ, ప్లాట్ నెంబర్ 69, అభినవ సహస్ర హాల్ వద్ద ఈ నెల 24 ఉదయం 10 గంటల నుంచి జరుగుతాయన్నారు. 20వ తేదీ లోగా పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

బోట్‌క్లబ్: ప్రతి భారతీయుడు తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ తూర్పు మండల అధ్యక్షుడు మునగాల సాయి గోపి అన్నారు. స్థానిక 4వ డివిజన్‌లో బుధవారం బీజేపీ నాయకుడు గాలిదేవర శేఖర్ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. వెంకట్‌నగర్ వేంకటేశ్వర స్వామి గుడి నుంచి డివిజన్లోని పలు వీధుల్లో ర్యాలీ సాగింది. నాయకులు జ్యోతుల రాజేష్, పార్థసారథి, ఓటేటి రాంబాబు, నేదూరి జయలక్ష్మి పాల్గొన్నారు.

రేపు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పెద్దాపురం: తొలి తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలకు ఆలయం తరఫున అమ్మవారి రూపు, జాకెట్, గాజులు, పసుపు, కుంకుమ, ప్రసాదం ఇస్తామన్నారు. ఉదయం 9 గంటలకే పూజ ప్రారంభం అవుతుందన్నారు. పూజకు సంబంధించిన మిగిలిన సామగ్రిని భక్తులు తమ వెంట తీసుకు రావాలని, అనంతరం అన్నప్రసాదం పంపిణీ ఉంటుందని ఈఓ తెలిపారు.

22న మరిడమ్మ ఆలయంలో..

ఈ నెల 22న పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడుతూ పూజల్లో పాల్గొన్న మహిళలకు ఆలయం తరఫున అమ్మవారి రూపు, జాకెట్, గాజులు, పసుపు, కుంకుమ, ప్రసాదం ఇస్తామన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ లోగా అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రత ఫారం పూర్తి చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వ్రతమాచరించే భక్తులకు 98498 98065, 90004 88945, 73822 56912 ఫోన్ నంబర్లకు చేయాలన్నారు.

మంగళ గౌరీదేవికి కుంకుమ పూజలు

పిఠాపురం: స్థానిక చింతావారి వీధిలోని మహాలక్ష్మీ గణపతి సహిత సీతారామాంజనేయ ఆలయంలో వేంచేసియున్న శ్రీమహాలక్ష్మి సన్నిధిలో బుధవారం మంగళ గౌరీదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. బ్యాంకు ఉద్యోగి రవీంద్రనాథ్ ఠాగూర్ సత్యాదేవి దంపతుల చేతుల మీదుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, శ్రీలక్ష్మీ గణపతి స్వామికి గరిక పూజ నిర్వహించారు. సుమారు 200 మంది ముత్తయిదువలకు పసుపు, కుంకుమ, గాజులు, పండ్లతో కూడిన వాయనం అందజేశారు. పురోహితుల పర్యవేక్షణలో అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చనలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొత్తపల్లి పద్మ బుజ్జి, చింతా వేంకటేశ్వరరావు, దూళ్ళిపూడి భీమేశ్వరరావు, నాగేశ్వరావు, భక్తులు పాల్గొన్నారు.



కరపలో చింతపల్లి వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



కరప పోలీస్ స్టేషన్ వద్ద..



కరప నక్కావారి ఎస్సీ వీధిలో..

జల జీవనం

- పల్లపు ప్రాంతాలు, వీధులు జలమయం
- చెరువులను తలపించిన రోడ్లు

కరప: వానొచ్చింది.. ముంచేసింది.. ఎక్కడ చూసినా చెరువులను తలపించింది.. అల్పపీడనం ప్రభావంతో బుధవారం మధ్యాహ్నం కుండపోతగా వర్షం పడింది. నియోజకవర్గంలో కరప మండలంలోని పలు గ్రామాల్లో శివారు, లోతట్టు ప్రాంతాలను జలమయం చేసింది. దీంతో జనజీవనం స్తంభించింది. గ్రామాల్లో పూర్తి స్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ లేక ఎక్కడికక్కడే నీరు నిలిచిపోయింది. ఇలా రోడ్లు చెరువులను తలపించాయి. కరప, నడకుదురు, గొర్రిపూడి ఇందిరాకాలనీ, గొడ్డటిపాలెం, కూరాడ, గురజనాపల్లి తదితర గ్రామాల్లో పూర్తి స్థాయిలో డ్రెయిన్లు లేక వీధులు, రోడ్లపై, ప్రభుత్వ కార్యాలయాల వద్ద, పాఠశాలల ఆవరణల్లో ముంపు నీరు తిష్ట వేసింది. వీధులన్నీ జలమయంగా మారాయి. రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడ్డారు. కరపలోని సీతమ్మవీధి, నక్కావారి ఎస్సీ వీధిలో డ్రైన్లు లేక రోడ్లపైనే నీరు నిలబడి పోగా, కొన్ని ప్రాంతాల్లో మోకాలులోతు నీరు వచ్చింది. ఆ బురద నీటిలోంచే వెళ్లాల్సి వస్తోందని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద వర్షం నీరు నిలబడిపోయింది. మోటార్‌తో తోడించడంతో కొద్దిసేపటికే నీరు తగ్గింది. మండలంలో కురుస్తున్న వర్షానికి తోడు పైమండలాల నుంచి ముంపు నీరు వచ్చి చేరుతుండటంతో పంట, మురుగు కాలువలు పొర్లి ప్రవహిస్తున్నాయి. మండలంలోని భూములన్నీ సముద్ర తీరాన, కాలువ శివారున ఉన్నాయి. వర్షం నీటితో పాటు, పైనుంచి మండలాల్లోని ముంపునీరు శహపురం, తుల్యభాగ డ్రెయిన్ల ద్వారా ప్రవహించి, సముద్రంలో కలుస్తాయి. కడియం, బిక్కవోలు, పెదపూడి తదితర మండలాల్లోని ముంపునీరు వచ్చి చేరడంతో తుల్యభాగ డ్రెయిన్ నీటి ప్రవాహం ఎక్కువై ఎం పొంగి ప్రవహిస్తోంది. వర్షాలకు కరప, వలసపాకల, వాకాడ, వేములవాడ, పాతర్లగడ్డ తదితర గ్రామాల్లో శివారు ప్రాంత, పల్ల భూముల్లో నీరు ఎక్కువగా ఉంది. మరో రెండు రోజులు వర్షాలు పడితే పొలాల్లో నీరు లాగక పంటలు ముంపునకు గురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నడకుదురు, కరపలోని చింతపల్లి వెళ్లే రోడ్డు, పోలీస్ స్టేషన్ ఎదురుగా నీరు తిష్ట వేసింది.



పిఠాపురం రోడ్డులో రాయుడుపాలెం వద్ద రోడ్డుపై వర్షపు నీరు

కాకినాడ రూరల్‌లో..

కాకినాడ రూరల్: అల్పపీడనం ప్రభావంతో కాకినాడ, పరిసర గ్రామాల్లో బుధవారం కుండపోతగా వర్షం పడింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఎడతెరిపి లేకుండా పడిన వర్షంతో పల్లపు ప్రాంతాల్లో ముంపు నీరు తిష్ట వేసింది. పలు గ్రామాల్లో నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. కాకినాడ నుంచి పిఠాపురం వెళ్లే మార్గంలో రాయుడుపాలెం జంక్షన్, అచ్చంపేట జంక్షన్ ప్రాంతాల్లో నీరు రోడ్డుపై ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడిప్పుడే నాట్లు వేయడంతో మళ్లలో నీరు నిలిచిపోతే వరి చేలు దెబ్బతింటాయని చెబుతున్నారు.

మహాత్ముని గుర్తుగా 'గాంధీభవన్'

కరప: జాతిపిత మహాత్మాగాంధీ మూడు గంటలు గడిపిన గుర్తుగా ఆ ఇంటికి 'గాంధీ భవన్' అని పేరు పెట్టారు. ఇప్పటికీ కరప మండలం వేళంగి, పరిసర గ్రామస్తులు అటుగా వెళితే గాంధీ భవనం, ఆ బాపూజీ గురించి స్మరించుకోవడం పరిపాటి. దక్షిణ భారతదేశ యాత్రలో భాగంగా పూజ్య బాపూజీ కాకినాడకు వచ్చినప్పుడు కరప ఫిరక్కా (కరప మండలం)లోని గ్రామాల మీదుగా పర్యటించి వేళంగి గ్రామానికి వచ్చారు. అప్పటి జిల్లా బోర్డు సభ్యుడు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు మెర్ల సత్యం ఇంటి వద్ద మూడు గంటలు ఉన్నారు. అక్కడ గ్రామస్తులు, హరిజనులనుద్దేశించి గాంధీ మాట్లాడినట్టు ఆ గ్రామానికి చెందిన డాక్టర్ బొండా వెంకన్నారావు, మెర్ల వీరయ్యచౌదరి తెలిపారు. గాంధీ మహాత్ముని మాటలకు ఆకర్షితులైన అప్పటి డీసీసీ ఉపాధ్యక్షుడు మెర్ల సత్యం సోదరుడు మెర్ల వెంకట సుబ్బారావు 10 ఎకరాల భూమిని హరిజన వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఇచ్చినట్టు ఆ గ్రామస్తులు తెలిపారు. అప్పట్లో బాపూజీని చూడడానికి వేళంగి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో రాగా, అందరినీ కలసి మాట్లాడినట్టు చెబుతుంటారు. ఎనిమిదేళ్ల బాలిక మెర్ల రంగనాయకులు (రంగమ్మ)ను గాంధీ మహాత్ముడు చూసి దేశం కోసం నీబంగారు నగలు ఇస్తావా అని అడిగారట. దానికి ఆ బాలిక తమ పెద్దలనడిగి ఇస్తానని బదులివ్వడంతో గాంధీ మురిసిపోయారని తమ పెద్దలు చెప్పారని డాక్టర్ వెంకన్నారావు తెలిపారు. గాంధీజీ వెళ్లిన తర్వాత మెర్ల సత్యం అల్లుడు రాజావెంకట దుర్గాప్రసాద్ చౌదరి (బందరు అబ్బాయి) ఆ ఇంటికి గాంధీభవన్ అనిపేరు పెట్టి పెద్ద అక్షరాలతో రాయించారు.



వేళంగిలో మహాత్ముని గుర్తుగా గాంధీభవన్ అని రాయించిన మెర్ల సత్యం గృహం ఇదే

క్రయ విక్రయదారులకు కష్టాలే..

కాకినాడ లీగల్: ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టడంలో రిజిస్ట్రేషన్ శాఖ అగ్రస్థానంలో ఉంటుంది. అయితే ఇక్కడ సేవలకు నిత్యం అంతరాయం కలుగుతుంది. కాకినాడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ సరఫరా ఉన్నా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ ఇన్వర్టర్లు పనిచేయకపోవడంతో కంప్యూటర్లు ఆగిపోయాయి. ముందుగా ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి ఇన్వర్టర్లు పనిచేయక కంప్యూటర్లు ఓపెన్ కాకపోవడంతో సమయం అయిపోవడంతో స్లాట్ బుకింగ్ ముగిసిపోయింది.

ఇందులో భాగంగా ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ముందుగా 12 మంది స్లాట్ బుకింగ్ చేసుకున్న దస్తావేజు రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో క్రయవిక్రయదారులు ఇబ్బందులకు గురయ్యారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇన్వర్టర్ పనిచేయకపోవడంతో సమయానికి స్లాట్ బుకింగ్ ఓపెన్ కాకపోవడం కారణంగా రిజిస్ట్రేషన్‌కు అదనంగా రూ.రెండు వందలు చెల్లించి మరో సమయానికి స్లాట్ బుకింగ్ చేసుకున్నారు. ప్రతి డాక్యుమెంట్‌కు రూ.500 చొప్పున యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారని, పనిచేయని ఇన్వర్టర్లు, కంప్యూటర్లతో కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగులతో పనిచేయిస్తుందని క్రయవిక్రయదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇన్వర్టర్లు పనిచేయకపోవడంపై కాకినాడ జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జేయూఎన్ జయలక్ష్మి వివరణ కోరగా, దీనిపై అనేకసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.



జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కంప్యూటర్లు పనిచేయక ఇలా..

ఈ–గ్రామ్ స్వరాజ్‌పై పట్టు సాధించాలి

సామర్లకోట: ఈ–గ్రామ్ స్వరాజ్‌పై ఎంపీడీఓలు పట్టు సాధించాలని జిల్లా పంచాయతీరాజ్ మేనేజర్ జి.స్వామి అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో గత నెల 28 నుంచి ఉమ్మడి జిల్లాలైన శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి జిల్లాలో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు నెల రోజుల పాటు శిక్షణ జరుగుతుంది. ఇందులో భాగంగా గురువారం ఈ–గ్రామ్ స్వరాజ్‌పై డీపీఎం శిక్షణ ఇచ్చారు. పంచాయతీరాజ్ సంస్థల ప్రణాళిక, బడ్జెట్, అకౌంటింగ్, పర్యవేక్షణ, ఆస్తుల నిర్వహణ వంటి విధులను ఏకీకృతం చేయడం ద్వారా వికేంద్రీకృత ప్రణాళిక, ప్రగతి నివేదిక, పని ఆధారిత అకౌంటింగ్‌లో మెరుగైన పారదర్శకతను తీసుకు రావడం లక్ష్యంగా ఈ గ్రామ్ స్వరాజ్‌ను ప్రారంభించారన్నారు. అదే విధంగా మరో సీనియర్ ఫ్యాకల్టీ సమాచార హక్కు చట్టంపై వివరించారు.



ఎంపీడీఓలకు శిక్షణ ఇస్తున్న డీపీఎం స్వామి

మంచి ఉత్తీర్ణతకు కృషి చేద్దాం



సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులకు సూచనలు ఇస్తున్న డీఐఈఓ శారద

సామర్లకోట: ఇంటర్‌లో ఫలితాల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖాధికారి ఐ.శారద అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో ఆమె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేయడంతో కళాశాల పరిస్థితులపై పూర్తి స్థాయిలో అవగాహన ఉంది. దాంతో విద్యార్థుల సంఖ్య పెరగడానికి, ఉత్తీర్ణత శాతం ఫలితాలపై ఆధారపడి ఉంటుందన్నారు. ఒకేషనల్‌పై మరింత దృష్టి సారించాలన్నారు. ఈ మేరకు అధ్యాపకుల హాజరు శాతం, టీచింగ్ డైరీ, విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. ఇంటర్ బోర్డు పాటిస్తున్న నియమ నిబంధనలు, సంస్కరణలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఒకేషనల్‌లో అడ్మిషన్ల శాతం పెంచడానికి ప్రిన్సిపాల్ సీహెచ్ లీలాశ్రీదేవి చేస్తున్న కృషిని అభినందించారు. అధ్యాపకులు మంచి విద్యాబోధనతో కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆమె సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీదేవి ఆధ్వర్యంలో డీఐఈఓ శారదను సత్కరించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌కు సమస్యను వివరిస్తున్న క్రాంతికుమార్

పెద్దాపురం: మున్సిపల్ పారిశుధ్యం విభాగంలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు పూర్తి రోజు వారాంతపు సెలవులు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్లు బుధవారం పెద్దాపురం కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సెలవులు ఇప్పించాలన్నారు. రోజూ మలినాలను శుభ్రం చేస్తున్న వారికి కనీస భద్రత లేకుండా పోయిందని, తక్షణం రక్షణ సౌకర్యాలు కల్పించాలని కోరారు. యూనియన్ నాయకులు వర్రే గిరిబాబు, మణికి కృష్ణ మాట్లాడుతూ వారం తప్పు, పండగ సెలవులు, క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ వారంతపు సెలవు ఇస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో యూనియన్ నాయకులు అందుగుల సురేష్, అప్పారావు, వర్రే రమణ, ముత్యాల సత్యనారాయణ, దొండపాటి శేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యువతపైనే దేశ భవిష్యత్తు

సామర్లకోట: దేశ భవిష్యత్తు యువశక్తిపై ఆధారపడి ఉందని, అటువంటి యువత మన దేశాన్ని మాదకద్రవ్య రహిత దేశంగా మార్చడానికి ప్రతిన బూనాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో పాఠశాల సిబ్బంది, విద్యార్థులచే నషాముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశలో మంచి అలవాట్లు కలిగి ధృడమైన యువశక్తిగా తయారు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.గంగాభవానీ, బీఆర్‌ఎస్ శివకుమార్, ఎన్.హరినాథ్, టీఎస్ పద్మావతి, పీఈటీ పి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు నగదు పురస్కారాలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ప్రభుత్వ పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో జరిగిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నగదు పురస్కారాలు అందిస్తున్నట్లు ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.పద్మనాభం బుధవారం తెలిపారు. కాకినాడ పెన్షనర్ల భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పద్మనాభం మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ ఉప్పలూరి గోపాలకృష్ణ మనమరాలు, రిటైర్డ్ సూపరింటెండెంట్ శేషగిరి సౌజన్యంతో నగదు, సర్టిఫికెట్లు అందిస్తున్నామన్నారు. గొల్లప్రోలు జెడ్పీ పాఠశాల విద్యార్థి తోట పుష్పాంజలి, సంపర జెడ్పీ పాఠశాల విద్యార్థి పోలిశెట్టి వీరవెంకట శివలక్ష్మి తేజశ్రీలు 594 మార్కులు సాధించడంతో వీరికి చెరో రూ.నాలుగు వేలు, జెడ్పీ పాఠశాల గొల్లప్రోలు ఆకేటి కనకవల్లి 590 మార్కులు రావడంతో రూ.3 వేలు, కొత్తపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థి తొగర పావని షణ్ముఖి, పండూరు జెడ్పీ పాఠశాల విద్యార్థి వై.రూపాదేవికి 588 మార్కులు పొందడంతో చెరో రూ. రెండు వేలు అందిస్తున్నట్లు శేషగిరి తెలిపారు. వీరికి ఈ నెల 15 సంఘ కార్యాలయ ఆవరణలో జరిగే వేడుకల్లో అందిస్తామన్నారు. 15న స్వాతంత్ర్య దినోత్సవానికి రిటైర్డ్ మేజర్ జనరల్ జ్యోతుల వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా వస్తారని పద్మనాభం తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు పద్మనాభం తదితరులు

మాదక ద్రవ్యాలతో అనర్థాలు



మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్న పీడీ లక్ష్మి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు నషా ముక్త్ (మాదక ద్రవ్యాల నుంచి విముక్తి) భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు బుధవారం మత్తు నివారణ, నియంత్రణపై గళమెత్తారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కాకినాడలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 15 పాఠశాలల్లో బుధవారం 3 వేల మంది పిల్లలకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల్ని వివరించామని పీడీ చెరుకూరి లక్ష్మి తెలిపారు. ఆమె స్వయంగా జగన్నాథపురం ఎంఎస్‌ఎన్ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మమేకమయ్యారు. యువ శక్తే దేశశక్తని అన్నారు. మాదక ద్రవ్యాలు ప్రత్యక్షంగా విషమేనని, శరీర వ్యవస్థలన్నీ దశల వారీగా చిన్నాభిన్నం చేస్తాయని తెలిపారు. విద్యార్థులతో మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించేందుకు దోహదపడతామని, బాధ్యతాయుతంగా నడుచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీపీఓ వెంకట్రావు, సూపర్‌వైజర్ దయామణి, జానకి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

- కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కళాశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్య విద్యార్థులతో పాటు వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఆధ్వర్యంలో ఆసుపత్రిలో నర్సింగ్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను వివరిస్తూ, భవిత, ఆరోగ్యానికి ఎంతటి ప్రమాదమో వివరించారు.
- జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ బిందుమాధవ్, అధికారులు నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని కాకినాడలోని గవర్నమెంట్ ఐటీఐ కళాశాలలో నిర్వహించారు. దేశానికి యువశక్తి ఎంత ప్రధానమో, దేహానికి ఆరోగ్యం అంతే ప్రధానమని అన్నారు. యువత ఆరోగ్యం, భవిత మంచి అలవాట్లతోనే ముడిపడి ఉన్నాయని అన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ దేశం, సమాజం, ఆరోగ్యం, భవితను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. పోలీస్ శాఖ తరఫున ఈగల్ ప్రత్యేక బృందాలు మాదక ద్రవ్యాల నివారణకు కృషి చేస్తున్నాయని తెలిపారు.

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

బాలాజీచెరువు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలంటూ పీఆర్ డిగ్రీ కళాశాల ఎదుట అధ్యాపకులు బుధవారం నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో అధ్యాపకులంతా సమావేశమై నినాదాలు చేశారు. బదిలీలు చేపట్టడంతో పాటు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు చేపట్టాలని, ముఖ్యంగా గతంలో బదిలీ చేసిన ఎయిడెడ్ అధ్యాపకులను తిరిగి వారి కళాశాలలకు పంపించాలని నిరసన తెలిపారు. అలాగే డిగ్రీ అడ్మిషన్ల జాప్యంతో వేలాది మంది విద్యార్థులు సమయం వృథా చేసుకుంటున్నారని, ఆర్థిక అంశాలతో సంబంధం లేని సమస్యలపై కాలయాపన చేయడం తగదన్నారు. ఈ నిరసనలో జిల్లా గెజిటెడ్ అధ్యాపకుల సంఘ అధ్యక్షుడు పసుపులేటి హరిరామప్రసాద్, కార్యదర్శి శ్రీచక్రవర్తి, లక్ష్మణ్, జయదేవ్ కుమార్, సత్యనారాయణ, పద్మావతి, సురేఖ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ



పాతర్లగడ్డలో క్లోరినేషన్‌ను పరిశీలిస్తున్న డీపీఓ రవికుమార్

కరప: గ్రామాల్లో అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) ఎ.రవికుమార్ అన్నారు. మండల పర్యటనలో భాగంగా బుధవారం ఆయన పాతర్లగడ్డ గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనుల నిర్వహణను పరిశీలించి, పంచాయతీ సిబ్బందికి సూచనలిచ్చారు. తడి, పొడి చెత్త విడిగా సేకరించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను కలసి పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను విడదీసి ఇవ్వాలన్నారు. తర్వాత తాగునీటికి క్లోరినేషన్ పరీక్ష నిర్వహించారు. క్లోరినేషన్ చేసిన తర్వాతే తాగునీరు సరఫరా చేయాలని డీపీఓ రవికుమార్ సూచించారు. గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కె.వరుణ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎండీ షాఫిన్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవ ఏర్పాట్లపై చర్చ



సూర్యారావుపేట బీచ్‌లో గణేశ విగ్రహ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ రూరల్: మండలంలోని సూర్యారావుపేట బీచ్‌లో సెప్టెంబరు 6, 7 తేదీల్లో చేపట్టనున్న వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవానికి ఏర్పాట్లను జేసీ రాహుల్ మీనా వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీల సమస్యలతో కలసి బుధవారం పరిశీలించారు. ఉత్సవ కమిటీకి చెందిన రంబాల వెంకటేశ్వరరావు, మాలకొండయ్య, దూసర్లపూడి రమణరాజు తదితరులతో కలసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జేసీ చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మల్లిబాబు, రూరల్ ఎంపీడీఓ సతీష్, ఈఓ పీఆర్ అండ్‌ఆర్‌డీ సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



సమాచార హక్కు చట్టంపై ర్యాలీ నిర్వహిస్తున్న సహకార శాఖ అధికారులు, సిబ్బంది

బోట్‌క్లబ్: స్థానిక జిల్లా సహకార శాఖ కార్యాలయంలో బుధవారం సమాచార హక్కు చట్టంపై సహకార శాఖ, సహకార సంఘాల సిబ్బందికి జిల్లా సహకార అధికారి బి.శ్రీనివాసరెడ్డి అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం ప్రజలకు, రైతులకు వజ్రాయుధం లాంటిదన్నారు. మన కార్యాలయానికి ఎవరు వచ్చి అడిగినా సమాచారం అందించాలన్నారు. సమాచారం కోసం వచ్చినప్పుడు వారు అడిగిన సమాచారం ఏ విధంగా రికార్డు చేసుకోవాలి, వారికి ఎన్ని రోజుల్లో సమాచారం ఇవ్వాలనేది వివరించారు. సమాచారం ఇవ్వడంలో ఏ స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం చేసినా ఇబ్బందులు తప్పవన్నారు. అనంతరం స్థానిక సహకార సంఘ కార్యాలయం నుంచి నాగమల్లితోట జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు.

ట్రాక్టర్లతో ర్యాలీ

కరప: తూరంగి నుంచి కరప మండలం వేళంగి వరకూ కూటమి నాయకులు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసినందుకు ఈ ర్యాలీ చేశామని ఎమ్మెల్యే నానాజీ తెలిపారు. పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు పాల్గొన్నారు.